క్లుప్తంగా

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగరపంచాయతీలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు శనివారం పరామర్శించారు. మృతుల్లో జరజాపుపేటకు చెందిన తాలాడ సన్నిబాబు, తాలాడ శ్రీను, నెల్లిమర్లకు చెందిన జూట్‌మిల్లు కార్మిక నేత ఉరిటి ఉమామహేశ్వర రావు ఉండగా, వారి కుటుంబ సభ్యులను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాయకులు గంటా సత్యనారాయణ, నల్లి శ్రీను, తుమ్మ నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, కనకల హైమావతి ఉన్నారు.

అలరించిన లయానందలహరి



నాదనీరాజనంలో లయానందలహరి నిర్వహిస్తున్న రవి, శారద

విజయనగరం టౌన్: టీటీడీలో జిల్లా కేంద్రానికి చెందిన కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసులు డాక్టర్ మండపాక రవి శనివారం నిర్వహించిన లయానందలహరి కార్యక్రమం భక్తులను ఆద్యంతం అలరించింది. ఘటంపైన కె.వి.రామకృష్ణ, తబలాపైన ఆనందకుమార్, వీణపైన వంశీకృష్ణ, తాళంపైన శైలజ, పద్మావతీశారద సహకారం అందించారన్నారు. ప్రధానంగా అన్నమాచార్య సంకీర్తన చక్కని తల్లికి ఇత్యాది విశేషాలతో అత్యద్భుతంగా సాగింది. అనంతరం దేవస్థానం ప్రతినిధులు రవి బృందాన్ని ఘనంగా సత్కరించారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

నెల్లిమర్ల: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరి పాటించాలని ఎంపీడీవో గిడుతూరి రామారావు సూచించారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సచివాలయ ఉద్యోగులంతా సమయానికి విధులకు హాజరై, ప్రజాసమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించాలని తెలిపారు. ఒక్కో సచివాలయంలో ప్రతిరోజూ ఉద్యోగుల్లో ఒకరిద్దరు గైర్హాజర వుతున్నట్లు తెలిసిందన్నారు. ఎవరైనా చెప్పకుండా విధులకు రాకుండా ఉండిపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం

గుర్ల: మండలంలోని భూపాలపురం గ్రామానికి చెందిన దివ్యాంగుడు శీర కృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి సభ్యులు శనివారం కృష్ణ ఇంటికి వచ్చి పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు. కృష్ణ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడని, చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిసి తమవంతు సహాయం చేశామని దివ్యాంగుల పరిరక్షణ సేవాసమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కానూరి శంకరరావు, పాండ్రంగి గోపాలరావు, జె.రామారావు, కె.శ్యామల ప్రుదు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల అలంకరణలో వేంకటేశ్వరస్వామి



విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ ఆవరణలో కొలువైన వెంకటేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పీవీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో శనివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు.

జాగ్రత్తలు పాటించండి

గజపతినగరం రూరల్: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. మర్రివలస పంచాయతీ పరిధిలోని సిగడంవలస, రాయివలస, ఏనుగులవలస గ్రామాల్లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శనివారం పర్యటించారు. ఆయా గిరిజన గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద టబ్బులు, గోళాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల వల్లే వస్తాయని, దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ఖాళీగా వదిలేసిన టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాల చిప్పల్లో దోమలు వృద్ధి చెందుతాయని, నివాసాల మధ్య వాటిని లేకుండా చూసుకోవాలని చెప్పారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల విజ్ఞప్తి



మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు తెలియజేస్తున్న సభ్యులు అప్పలనాయుడు, రమేష్

పూసపాటిరేగ: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పలువురు సభ్యులు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవిని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్లలో నియోజకవర్గంలోని మారుమూల గ్రామానికి సైతం తాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. బొర్రవానిపాలెంలో ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చి, రిజిస్ట్రేషన్ చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని కుమిలి సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ, పతివాడ ఎంపీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనాయుడులు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. గోవిందపురం రెవెన్యూ పరిధిలోని తోటపల్లి కాలువను కప్పి లేఅవుట్ వేశారని, దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యురాలు దంగుడుబియ్యపు సునీత తెలిపారు. రెల్లివలస గ్రామంలో సీసీ రోడ్డు తవ్వి పైపులు వేయడంతో రోడ్డు అధ్వానంగా తయారైందని సర్పంచ్ ఇజ్జిరోతు అప్పలరాజు అన్నారు. కోనయ్యపాలెంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి లలితకళ విజ్ఞప్తి చేశారు. పతివాడబ్రిపేట ప్రభుత్వ పాఠశాలలో ఆయాను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని సభ్యులు పతివాడ అప్పలనాయుడు, పి.తమ్మునాయుడులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. నడిపల్లి గ్రామం పరిధిలోని చంపావతి నదిలో ఎయిర్‌పోర్టు కోసం బోరును తవ్వి నీరు తీసుకువెళ్లడానికి ప్రతిపాదనలు చేశారని, అదే జరిగితే భూగర్భజలాలు అడుగంటి ఇబ్బంది పడే పరిస్థితి ఉందని, అలాగే ప్రభుత్వ పాఠశాల కూలిపోయిందని, అ స్థానంలో నూతన భవనం నిర్మాణం చేయాలని సర్పంచ్ లంకలపల్లి గాయత్రి కోరారు. వెంపడాం రైతు భరోసా కేంద్రాన్ని వేరేచోటకు మార్చాలని చూస్తున్నారన్న విషయం ఎమ్మెల్యేకి తెలిపారు. కనిమెల్లలోని రైతు భరోసా కేంద్రం అద్దె గొడౌన్ యజమాని వివాదాస్పదంగా వ్యవహరిస్తుండడంతో విత్తనాలు, ఎరువులు గొడౌన్‌లో వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెలుదూరు రెవెన్యూ పరిధిలో శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురైందని ఎంపీటీసీ సభ్యురాలు కొత్తలి గౌరీసరోజ ఆరోపించారు. పూసపాటిరేగలో శిథిలావస్థలోని తాగునీటి ట్యాంకును వెంటనే తొలగించాలని సర్పంచ్ టొంపల సీతారాం అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యులు మహంతి సీతాలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి బి.శాంతాకుమారి, ఎంపీడీవో ఎం.రాధిక, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చినఅప్పన్న తదితరులు పాల్గొన్నారు.



చంపావతి నదిలో బోరు వేయడంతో భూగర్భజలాలు అడుగంటిపోతాయని ఎమ్మెల్యేకు చెబుతున్న నడిపల్లి సర్పంచ్ గాయత్రి

పాలాల్లో వర్షపునీరు లేకుండా చూడండి

- జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు



నీటమునిగిన వరి పంటపొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

భోగాపురం: పొలాల్లో వర్షపునీరు నిల్వలేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు రైతులకు సూచించారు. మండలంలోని దల్లిపేట, భోగాపురం, ముంజేరు గ్రామాల్లోని నీటమునిగిన వరిపంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. మూడురోజులుగా కురిసిన వర్షాలకు నారుమడులు నీటమునిగిపోగా, అదే నీరు అలాగే ఉండిపోతే పంట నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం వర్షం తగ్గినందున పొలాల్లోని వర్షపునీటిని బయటకు పంపించాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీఏ నాగభూషణ్, ఏవో హరికృష్ణ, వీఏఏ వెంకటరావు, రైతులు ఉన్నారు.

ఆగస్టు 15న ప్రతిభా పురస్కారాల ప్రదానం



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

విజయనగరం: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్య వైశ్య సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 15వ తేదీన ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానికంగా ఉన్న ఆ సంఘం కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల ప్రదానానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్రాజెక్టు చైర్మన్ బొడ్డు మురళీమోహన్ కృష్ణారావు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 85 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన 10వ తరగతి నుంచి డిగ్రీ, సీఏ, పాలిటెక్నిక్ విద్యార్థులు పురస్కారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగస్టు 6వ తేదీలోగా కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, ఆగస్టు 15వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ఉల్లి వీధిలోని ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద జరిగే కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని నానాజీ, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ వజ్రపు కృష్ణారావు, డిమ్స్ రాజు, గుంపిన నారాయణరావు, తవ్వా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనులు చేపట్టండి



మాట్లాడుతున్న నగరపంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని నగరపంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ సూచించారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బందితో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో మురుగునీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్, దోమల నివారణ మందు చల్లాలన్నారు. అలాగే ప్రతీ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బందితో పనులు చేయించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాలకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి, వివరాలను శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతిరోజూ గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని శానిటరీ కార్యదర్శులకు సూచించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

చెరువులను తలపిస్తున్న పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మూడురోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ క్రమంలో విజయనగరం జిల్లాలోని డెంకాడ నుంచి నాతవలస రోడ్డు పక్కన ఉన్న పొలాలు వర్షపునీటితో నిండిపోయి చెరువుల్లా కనిపిస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం తమ కొంప ముంచిందని నువ్వు రైతులు లబోదిబోమంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్





నాతవలస వద్ద వర్షానికి తడిసిన నువ్వుచేనును ఆరబెడుతున్న రైతులు







నాతవలస నుంచి డెంకాడ ప్రాంతంలో నీటమునిగిన పంటపొలాలు

పాలిథిన్ సంచులు విక్రయిస్తే కఠిన చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలు ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని 6, 12, 35, 37, 59 సచివాలయాల పరిధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు, కాలువల్లో పూడికతీతలు, నేలకొరిగిన చెట్లతొలగింపు పనులను దగ్గరుండి పరిశీలించిన ఆయన.. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం దాసన్నపేట రైతుబజారుకు వెళ్లి, కూరగాయల విక్రయదారులకు పలు సూచనలు చేశారు. పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు నిషేధిత పాలిథిన్ సంచులు ఇవ్వవద్దని, అలా ఇస్తే పరోక్షంగా వారిని వాడమని చెప్పినట్లేనన్నారు. మరోసారి తన పర్యటనలో ఎవరిదగ్గరైనా పాలిథిన్ సంచులు కనిపిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అక్కడి నుంచి పోలయ్యపేట వెళ్లి, అక్కడి కాలువ దుస్థితిని పరిశీలించారు. డీఈ అప్పారావు, శానిటేషన్ కార్యదర్శులతో మాట్లాడి కాలువలో వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని, అలాగే విద్యుత్ సమస్యలు లేకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వినతిపత్రం అందజేత



ఏపీజీఎల్ఐ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ తుది చెల్లింపుల సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా సంస్థ(ఏపీజీఎల్ఐ) అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) హైమావతిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీజీఎల్ఐలో దాచుకున్న సొమ్మును అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. అవసరాలకు తీసుకున్న రుణాలను కూడా త్వరితగతిన మంజూరు చేసి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడీని కలిసిన వారిలో సంఘ ప్రధాన కార్యదర్శి టి.సన్యాసిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ సి.హెచ్.రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థలో ఉపాధ్యాయులు దాచుకున్న సొమ్ము అవసరాలకు తిరిగి అందడం లేదని, జాప్యం లేకుండా చెల్లింపులు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ సభ్యులు పలుపురు సంస్థ సహాయ సంచాలకులు హైమావతిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బాండుల తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులు, ప్రీమియం పెంచాలన్న వినతుల పరిష్కారంలో తీవ్రజాప్యం జరుగుతోందని, వ్యక్తిగత, డీడీవో లాగిన్‌ల నుంచి జిల్లా కార్యాలయానికి వచ్చిన ఫైళ్లను నెలల తరబడి పరిష్కరించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.పైడిరాజు, డి.ఈశ్వరరావు, ఎ.వి.శ్రీనివాసరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం రూరల్: నవధాన్యాలు సాగుచేయడం ద్వారా నేల సారవంతమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు తెలిపారు. మండలంలోని జొన్నవలస గ్రామంలో పి.అప్పలనర్సింహరాజు పొలంలో సాగుచేస్తున్న నవధాన్యాల పంటను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని, మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్నితే నేల సారవంతం కావడంతో పాటు అదే నేలలో పండించే పంటలు బాగా పండుతాయన్నారు. అలాగే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బీపీఎం ఆనందరావు, ఏడీఏ నాగభూషణం, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లు వర్తింపజేయాలి

- కలెక్టర్‌కు తెలగ సంక్షేమ సంఘం వినతి



కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం అర్బన్: వయోపరిమితి సడలిస్తూ అమలుచేస్తున్న సామాజిక పింఛన్‌లను తెలగ కులస్తులకు కూడా వర్తింపజేయాలని జిల్లా తెలగ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా, ఉత్తరాంధ్ర తెలగ కమిటీ అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్ అంబేడ్కర్‌ని కలిసి వినతిపత్రం శనివారం అందజేశారు. 1915 నుంచి 1966 వరకు ఉన్న బీసీ రిజర్వేషన్లు తర్వాత లేకపోవడం కారణంగా ఓసీ కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల్లోని ఆర్థికంగా వెనకబడిన వారు నష్టపోతున్నారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనకబడిన వారు అన్నిరంగాల్లోనూ ఉన్నారని, ఇటువంటి పరిస్థితుల్లో అలాంటి వారికి కూడా సామాజిక పింఛన్లు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు కాజా సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు మామిడి రామారావు, తాడి నానాజీ, కూనిబెట్టి భాస్కరరావు, ప్రసాదరావు, అమలకంటి అప్పారావు, తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ గాలి కొదిలేశారు..

శృంగవరపుకోట: రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం నిరసన తెలిపా రు. స్థానిక దేవీ జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. జిల్లా మాదక ద్రవ్యాల మత్తులో ఊగుతోందని, నేరాలను కట్టడి చేయాల్సిన పోలీసు, ప్రభుత్వ యంత్రాంగాలు ప్రజల రక్షణ గాలి కొదిలేసి ప్రజాప్రతినిధుల సేవల్లో తరిస్తున్నారన్నారని మండిపడ్డారు. మహిళా సంరక్షణకు తెచ్చిన చట్టాలు పత్రికలకే పరిమితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంతతకు మారు పేరు అయిన జిల్లా నేడు అత్యాచారాలు, హత్యలు, హత్యాయత్నాలు, గంజాయి అమ్మకాలు, దొంగతనాలు,దోపిడీలకు అడ్డా అయ్యిందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, నాయకులు, జిల్లా గత చరిత్రను తెలుసుకుని ప్రజలకు ఏమి కావాలో, దేని గురించి మాట్లాడుకుంటున్నారో కళ్లు, చెవులు తెరిచి గమనించాలని కోరారు. అత్యాచారాలకు పాల్పడిన వాళ్లు ఎవ్వరైనా బాధితులు మన కుటుంబ సభ్యులు అయితే అన్న మానవీయ కోణంలో ఆలోచించి కేసులు నమోదుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోకుంటే ప్రజా ఉద్యమాలతో జిల్లాలో యంత్రాంగాన్ని మేల్కొలపాల్సి వస్తుందని హెచ్చరించారు.